

# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 8-15 జూన్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 52 | పేజీలు : 4 | రూ. 5.00


## ఈ నెల 23 నుంచి ఇంటింటికీ 'తొలి అడుగు' విజయయాత్ర: సీఎం చంద్రబాబు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ నెల 23వ తేదీ నుంచి నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ఇంటింటికీ విజయయాత్ర నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ యాత్ర ద్వారా... ప్రభుత్వం ఏడాది కాలంలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ విజయయాత్రలో నాయకుల నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొని, ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రచారం చేయడంలో పోటీపడాలని ముఖ్యమంత్రి కోరారు. "మొదటి ఏడాది మనం ఏం చేశామో చెప్పడంతో పాటు, ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలి. మనం సాధిస్తున్న విజయాలు చూసి తట్టుకోలేకనే వారు మహిళలను అవమానించడం, దాడులకు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు" అని చంద్రబాబు అన్నారు. మహానాడు విజయవంతమైందని విశ్రాంతి తీసుకోవద్దని, పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని, పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి కమిటీలలో సముచిత స్థానం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. 'కుటుంబ సాధికార సారథి'లో చురుగ్గా ఉన్నవారికే పార్టీలో పదవులు లభిస్తాయని, కార్యకర్తలు నిత్యం చైతన్యవంతంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

**'సంక్షేమ పథకాల జోరు, ఆర్థిక క్రమశిక్షణ'...** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేశామని, ఎంతమంది పిల్లలున్నా ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరేలా నిధులు విడుదల చేశామని సీఎం తెలిపారు. "మొత్తం 67.27 లక్షల మంది విద్యార్థులకు గాను, తల్లుల ఖాతాల్లోకి రూ. 13,000 చొప్పున, పాఠశాలల అభివృద్ధికి రూ. 2,000 చొప్పున జమ చేస్తున్నాం. ఈ పథకం కింద రూ. 8,747 కోట్లు కేటాయించాం. గత ప్రభుత్వం 42 లక్షల మందికి మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేసి రూ. 5,540 కోట్లు ఖర్చు చేస్తే, మనం అదనంగా 25 లక్షల మందికి లబ్ధి చేకూరుస్తూ, ఏటా రూ. 3,205 కోట్లు ఎక్కువగా ఖర్చు చేస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. నలుగురు పిల్లలు ఉన్న తల్లికి రూ. 52,000 అందుతాయని, ఇంత పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నా కొందరు బుద్ధి, జ్ఞానం లేకుండా విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఈ నెల 20వ తేదీన ప్రారంభిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద ఏటా రూ. 34 వేల కోట్లు అందిస్తున్నామని, అన్నా క్యాంటీన్ల ద్వారా ఇప్పటికే 4 కోట్ల భోజనాలు సరఫరా చేశామని గుర్తుచేశారు.

**యోగా దినోత్సవానికి భారీ ఏర్పాట్లు, పార్టీ కార్యకర్తలకు శిక్షణ...** రాష్ట్రంలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని 5 లక్షల మందితో నిర్వహించనున్నామని సీఎం తెలిపారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాలో పాల్గొనేలా లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటికే 2.21 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. "యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణమే మన లక్ష్యం. రేపు (శనివారం) లక్ష చోట్ల యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమాలు జరుగుతాయి" అని వెల్లడించారు. జూలై నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులకు నాయకత్వ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని, కార్యకర్తలను సమర్థవంతమైన నాయకులుగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలో లేనప్పుడు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని, ఎమ్మెల్యేలు కూడా ప్రతిరోజూ పార్టీ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించి, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు.

## 'తల్లికి వందనం' కింద 67.27 లక్షల విద్యార్థులకు రూ.8,745 కోట్లు



తల్లికి వందనం పథకానికి సంబంధించి గత ప్రభుత్వం ఏ నిబంధనలైతే అమలు చేసిందో, అవే నిబంధనలను తాము కూడా పాటిస్తున్నామని, కాబట్టి ఈ పథకంపై తమను ప్రశ్నించే నైతిక హక్కు వైసీపీ వాళ్లకు లేదని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'బాబు సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'తల్లికి వందనం' పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 8,745 కోట్లను జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. శుక్రవారం ఉండవల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లోకేశ్ ఈ వివరాలను ప్రకటించారు.

గత విద్యాశాఖ మంత్రికి ఏం తెలుసు? గత విద్యాశాఖ మంత్రికి కనీస పరిజ్ఞానం కూడా లేదని, యూడైస్ డేటాలో ప్రీప్రైమరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లల వివరాలు కూడా కలిపి తప్పుడు లెక్కలు చూపారని లోకేష్ ఆరోపించారు. "తల్లికి వందనం పథకానికి గత ప్రభుత్వం విధించిన అవే నిబంధనలను, అవే అర్హతలను తాము పాటిస్తున్నప్పుడు, తమను ప్రశ్నించే అర్హత, హక్కు వారికి ఎక్కడిది?" అని లోకేశ్ నిలదీశారు. గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తున్నందున, ఈ పథకం అమలుపై విమర్శలు చేసే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని ప్రతిపక్షానికి హితవు పలికారు.

**అర్హులందరికీ సాయం, పారదర్శకతకు పెద్దపీట...** తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల్లో చేరిన తర్వాత కూడా వారి తల్లుల ఖాతాల్లోకి నిధులు జమచేస్తామని తెలిపారు. తల్లి లేని పిల్లలకు తండ్రి లేదా సంరక్షకుల ఖాతాల్లో, అనాథాశ్రమాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ల ద్వారా నిధులు చేరతాయని స్పష్టం చేశారు. నిధుల జమలో ఏవైనా సమస్యలుంటే జూన్ 26 వరకు 'మనమిత్ర' వాట్సాప్ ద్వారా లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కొన్ని ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం వల్ల నిధులు వెనక్కి వచ్చాయని, వారికి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించి, ఖాతాలను యాక్టివేట్ చేయించుకున్న వెంటనే నిధులు జమచేస్తామని వివరించారు.

**గత ప్రభుత్వం కంటే భారీగా నిధులు, లబ్ధిదారులు...** ఈ పథకం ద్వారా సుమారు 30 లక్షల మంది బీసీ, 12 లక్షల మంది ఎస్సీ, 4.26 లక్షల మంది ఎస్టీ విద్యార్థుల తల్లులతో పాటు ఇతర వర్గాలకు కూడా ప్రయోజనం కలుగుతుందని లోకేష్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం 'అమ్మఒడి' కింద 42 లక్షల మంది విద్యార్థులకు ఏటా రూ. 5,540 కోట్లు కేటాయిస్తే, తమ కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మందికి రూ. 8,745 కోట్లు అందించిందని పోల్చి చూపారు. దీనివల్ల ఏటా రూ. 3,205 కోట్లు, ఐదేళ్లలో మొత్తం రూ. 16,000 కోట్లు అదనంగా తల్లుల ఖాతాల్లోకి జమ అవుతాయని ఆయన సగర్వంగా ప్రకటించారు.

**విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు...** విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని లోకేష్ పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచిన తొలిరోజే 80% విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూల్ కిట్‌లు (పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూస్, సాక్స్) అందజేశామని, మిగిలిన వారికి ఈ నెల 20వ తేదీలోగా పంపిణీ పూర్తి చేస్తామన్నారు. గతంలో నిలిపేసిన ఇంటర్ విద్యార్థులకు కూడా ఈ ఏడాది ఏప్రిల్‌లోనే కిట్లు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం పంపిణీని ఇప్పటికే ప్రారంభించామని, రాష్ట్రవ్యాప్తంగా 9,600 పాఠశాలల్లో 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానం అమలు చేస్తున్నామని, ఇది గతంలో కేవలం 1,200 పాఠశాలలకే పరిమితమై ఉండేదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గ్యారెంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ద్వారా విద్యా ప్రమాణాలు గణనీయంగా పెంచుతామని చెప్పారు.

## 2574 కేంద్రాలలో యోగా డెమోన్స్ట్రేషన్

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో గల సచివాలయాలన్నిటిలోనూ ప్రతి సచివాలయానికి 9 కేంద్రాలలో యోగ డెమోన్స్ట్రేషన్ నిర్వహించారని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర శనివారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దే తరుణంలో యోగాంధ్ర కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగ పై అవగాహన కల్పిస్తున్న సందర్భంగా, ప్రతి సచివాలయంలో 9 కేంద్రాలను గుర్తించి ఆ కేంద్రాలలో ప్రజలకు యోగ పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ విజయవాడ నగరపాలక సంస్థలో గల 286 సచివాలయాల్లో 2574 కేంద్రాలలో యోగా డెమోన్స్ట్రేషన్ నిర్వహించారని కమిషనర్ తెలిపారు. ప్రజలకు యోగ చేపిస్తూ యోగ వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పిస్తూ ప్రజలను ఆరోగ్యవంతంగా చేయించటమే యోగాంధ్ర కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ముఖ్యంగా ప్రతి డివిజన్‌లో గల స్పెషల్ ఆఫీసర్లు వారి పరిధిలో గల సచివాలయా ల్లోని యోగా కేంద్రాలలో యోగాంధ్ర కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించారని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని సచివాలయాల్లో ఉన్న ప్రతి కేంద్రంలో ప్రజలకు యోగాంధ్ర కార్యక్రమం ద్వారా కల్పించే అవగాహన కార్యక్రమాలు తెలియపరచమని తెలిపారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం...



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 31 మందిని డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్టు సివిల్ ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. వీరిలో 12 మంది మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తెలిపారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, వీరిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహం కూడా ఉందని, ఆయన డీఎన్ఏ పరీక్ష ఫలితాలు ఇంకా రావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. సివిల్ ఆసుపత్రి ఏడీఎంఎస్ డాక్టర్ రజనీష్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకు 31 మంది వ్యక్తుల డీఎన్ఏ సరిపోలింది, వారిని గుర్తించాం. వీరిలో 12 మృతదేహాలను ఉదయ్‌పూర్, వడోదర, ఖేడా, కుషీనగర్, అహ్మదాబాద్‌లోని వారి స్వస్థలాలకు పంపించాం" అని తెలిపారు. "మిగిలిన వారి ఆప్తుల మృతదేహాలను తీసుకెళ్లేందుకు మరికొన్ని కుటుంబాలు ముందుకు రావాల్సి ఉంది. ఇతరుల డీఎన్ఏ ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది" అని ఆయన వివరించారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ పరీక్ష ఇంకా కొనసాగుతోందని డాక్టర్ పటేల్ ధ్రువీకరించారు. "ఇప్పటివరకు ఆయన డీఎన్ఏ సరిపోలలేదు. ఫలితం రాగానే సంబంధిత అధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 13 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కూడా ఆయన వెల్లడించారు. మృతదేహాలు తీవ్రంగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో, వాటిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) కు చెందిన ఫోరెన్సిక్ బృందాలు ఈ బృహత్తర గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఊరట కలిగించేందుకు ఈ బృందాలు అహోరాత్రులు శ్రమిస్తున్నాయి. ఈ నెల 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అదుపుతప్పి సివిల్ ఆసుపత్రి బి.జె. మెడికల్ కళాశాల సమీపంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణికులు, నేలపై ఉన్న నివాసితులు సహా 260 మందికి పైగా మరణించారు. ఒక ప్రయాణికుడు మాత్రం గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం వల్ల సమీప ప్రాంతాల్లో, ముఖ్యంగా అక్కడి వైద్య విద్యార్థుల వసతి గృహాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం.. దర్యాప్తునకు ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటి



అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ఏఐ-171 విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘోర దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు భారత ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగిన అతిపెద్ద విమాన ప్రమాదాల్లో ఒకటిగా నిలిచిన ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు, మూల కారణాలను వెలికితీయడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)కు చెందిన సీనియర్ అధికారులతో పాటు ఇతర సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రమాద కారణాలను నిగ్గు తేల్చేందుకు వీరు అంతర్జాతీయ సంస్థల నిపుణులతో కలిసి పనిచేయనున్నారు. ఈ ఉన్నతస్థాయి కమిటీ రాబోయే కొద్ది వారాల్లో ప్రాథమిక వాస్తవ నివేదికను సమర్పించే అవకాశం ఉంది. ఈ దర్యాప్తు ద్వారా వెలుగులోకి వచ్చే అంశాలు భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా నిరోధించడానికి దోహదపడతాయి. కాగా, దర్యాప్తు బృందాలు ఇప్పటికే విమానానికి చెందిన రెండు బ్లాక్ బాక్సులను (ఫ్లైట్ డేటా రికార్డర్, కాక్ పిట్ వాయిస్ రికార్డర్) స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో ఒకటి స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ, దాని నుంచి సమాచారాన్ని సేకరించవచ్చని నిపుణులు చెబుతున్నారు. విమానం కూలిపోవడానికి ముందు జరిగిన సంఘటనల క్రమాన్ని అర్థం చేసుకోవడంలో ఈ ఫ్లైట్ రికార్డర్ల నుంచి లభించే సమాచారం అత్యంత కీలకమని భావిస్తున్నారు. సాంకేతిక లోపం, విమానం రెక్కల ఫ్లాప్ సెట్టింగ్‌లు లేదా డేటా ఇన్‌పుట్‌లో పొరపాట్లు, వాతావరణ పరిస్థితుల ప్రభావం వంటి అనేక కోణాల్లో దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. ఇక, ఈ దర్యాప్తు ప్రక్రియలో అంతర్జాతీయ సహకారం కీలక పాత్ర పోషిస్తోంది. అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ) నిపుణులు ఇప్పటికే భారత అధికారులతో కలిసి ఆధారాలను పరిశీలించేందుకు సిద్ధమయ్యారు. అలాగే అంతర్జాతీయ విమానయాన నిబంధనల ప్రకారం, కెనడాకు చెందిన ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (టీఎస్‌బీ) కూడా ఒక నిపుణుడిని ఈ దర్యాప్తు పురోగతిని పర్యవేక్షించేందుకు నియమించింది.

## భారత్-పాక్ మధ్య నేను కుదిర్చినట్టుగా ఇజ్రాయెల్-ఇరాన్ కూడా ఒక ఒప్పందం కుదుర్చుకోవాలి: ట్రంప్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుతం ఉద్రిక్తంగా మారిన ఇజ్రాయెల్-ఇరాన్ వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాలు చర్చల ద్వారా ఓ ఒప్పందానికి రావాలని, ఇటీవల తాను భారత్-పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చిన తరహాలోనే ఇజ్రాయెల్-ఇరాన్ కూడా ఓ ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. ఇది కూడా సాధ్యమవుతుందని భావిస్తున్నానని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. "ఇరాన్, ఇజ్రాయెల్ ఓ ఒప్పందం చేసుకోవాలి, కచ్చితంగా చేసుకుంటాయి. గతంలో నేను భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చినట్లే ఇది కూడా జరుగుతుంది. అమెరికాతో వాణిజ్యాన్ని (ట్రేడ్) ఉపయోగించి ఇరు దేశాల అద్భుతమైన నేతలతో చర్చలు జరిపి, సహేతుకత, సమన్వయం, వివేకాన్ని తీసుకువచ్చి, వారిని త్వరితగతిన ఓ నిర్ణయానికి వచ్చేలా చేసి, వివాదాన్ని ఆపగలిగాను!" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. కేవలం భారత్-పాకిస్తాన్ వివాదమే కాకుండా, తాను మరికొన్ని అంతర్జాతీయ సమస్యలను కూడా పరిష్కరించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. "నా మొదటి విడత అధ్యక్ష పదవీకాలంలో, సెర్బియా, కొసావోలు దశాబ్దాలుగా తీవ్రంగా ఘర్షణ పడుతుండేవి. ఆ చిరకాల వివాదం యుద్ధంగా మారేందుకు సిద్ధంగా ఉండేది. నేను దాన్ని ఆపాను. గత అధ్యక్షుడు బైడెన్ కొన్ని తెలివితక్కువ నిర్ణయాలతో దీర్ఘకాలిక అవకాశాలను దెబ్బతీశారు, కానీ నేను దాన్ని మళ్ళీ సరిచేస్తాను!" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈజిప్ట్, ఇథియోపియాల మధ్య నైలు నదిపై నిర్మిస్తున్న భారీ డ్యామ్ విషయంలో తలెత్తిన వివాదాన్ని కూడా తానే పరిష్కరించానని ఆయన తెలిపారు. "నా జోక్యం వల్లే, కనీసం ఇప్పటికైనా అక్కడ శాంతి నెలకొంది, అది అలాగే ఉంటుంది! అదేవిధంగా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కూడా త్వరలోనే శాంతి నెలకొంటుంది! ప్రస్తుతం అనేక ఫోన్ కాల్స్, సమావేశాలు జరుగుతున్నాయి. నేను చాలా చేస్తాను, కానీ దేనికీ నాకు గుర్తింపు రాదు, అయినా ఫర్వాలేదు, ప్రజలకు అర్థమవుతుంది" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## ఏకైక మృత్యుంజయుడు రమేశ‌ను ప్రత్యేకంగా కలిసిన మోదీ



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటన యావత్ దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. నిన్న జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. కేవలం ఒక వ్యక్తి మాత్రమే మృత్యుంజయుడిగా నిలిచారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అహ్మదాబాద్‌లో పర్యటించి, ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీ, నేరుగా మేఘానీనగర్‌లోని ప్రమాద స్థలానికి వెళ్లారు. ఆయన వెంట గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కూడా ఉన్నారు. ప్రమాదం జరిగిన తీరును, సహాయక చర్యల పురోగతిని అధికారులు ప్రధానికి వివరించారు. అనంతరం, ఈ దుర్ఘటనలో అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి, భారత సంతతికి చెందిన బ్రిటిష్ జాతీయుడు విశ్వాశ్ కుమార్ రమేశ్‌ను ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎక్స్ వేదికగా నిన్న మోదీ పేర్కొన్నారు. "ఈ విషాదం మాటలకు అందనిది. ఈ దుఃఖ సమయంలో, బాధితులందరి గురించి నా ఆలోచనలు ఉన్నాయి. బాధితులకు సహాయం చేయడానికి మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాను" అని ఆయన తెలిపారు.

## 'జీరో కరెప్షన్ ఏపీ' లక్ష్యం



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏ శాఖలో, ఎక్కడ, ఎవరు అవినీతికి పాల్పడినా సహించేది లేదని... జీరో కరెప్షన్ దిశగా రాష్ట్రంలో పాలనా వ్యవస్థను నిర్మించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ జరపాలని... అవినీతి రుజువైతే తక్షణం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి... వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వ్యక్తమైన అభిప్రాయాలపై శనివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్టు ఐవీఆర్ఎస్, సీఎస్‌డీఎస్ ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడైందని... అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని... సమస్యలు ఉన్న చోట సంతృప్తి పెంచేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం, ఉద్యోగాలకల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి...వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. వర్క్ ఫ్రమ్ హోమ్, పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేయాలన్నారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, ఆగస్ట్ 15 కల్లా అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర కింద అందించాలని స్పష్టం చేశారు. మరోవైపు...వికలాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించడ మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలన్నారు. చౌకధరల దుకాణాలను పెంచడం, నగదు... లేదంటే కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. అలాగే ఉచిత ఇసుక విధానం అమలులో...ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయం ఇలా : పింఛన్ల పంపిణీ : అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటిదగ్గరే ఇస్తున్నారని 87.8 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 83.9 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా...పింఛన్ల పింపిణీలో అవినీతి లేదని 93.9 శాతం మంది, ఇంటిదగ్గరే ఇస్తున్నారని 93.3 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బావుందని 73.3 శాతం మంది-పర్వాలేదు అని 23.1 శాతం మంది చెప్పారు. అన్న క్యాంటీన్లు : పరిశుభ్రంగా ఉన్నాయని 80.5 శాతం, ఆహారం నాణ్యత బావుందని 79.3 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.8 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా చెప్పారు. ఆస్పత్రి సేవలు : క్వాలిటీ చెకప్‌పై 68.4 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ సేవలు : రోజూ చెత్త సేకరణపై 68.1 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం సంతృప్తి చెందారు. ఆలయాలు : సౌకర్యాలకు సంబంధించి 68 శాతం దర్శనం బావుందని, 63.6 శాతం సౌకర్యాలు బావున్నాయని, 77.7 శాతం ప్రసాదం నాణ్యత బావున్నాయని భక్తులు చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీ : శుభ్రత, సీటింగ్ విషయంలో 53.4 శాతం, నీటి సౌకర్యం 45.2 శాతం, టాయిలెట్స్‌పై 56 శాతం, బస్సు సమయం-రూట్ వివరాలపై 61.5 శాతం, 69 శాతం మంది బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని, 69.7 శాతం సమయానికి చేరుకుంటున్నామని, 72.4 శాతం సిబ్బంది ప్రవర్తన బావుందని, 69.7 శాతం రక్షణ కలిగి ఉన్నాయని చెప్పారు. దీపం-2 : ఎక్కువ డబ్బు వసూళ్లు చేయడం లేదని 62.8 శాతం చెప్పారు. రేషన్ : నెలనెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.1 శాతం, నాణ్యత బావుందని 73.8 శాతం చెప్పారు. ఎరువులు : లభ్యత ఉందని 60.9 శాతం మంది రైతులు చెప్పారు. విత్తనాలు : సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం చెప్పారు. గంజా, డ్రగ్స్ : తమ ప్రాంతంలో డ్రగ్స్ సంబంధిత సమస్య ఉందని 27.4 శాతం, పోలీసులు స్పందిస్తున్నారని 54.5 శాతం మంది చెప్పారు. మహిళలపై హింస : పబ్లిక్ ప్రాంతాల్లో వేధింపులు ఉన్నాయని 27.8 శాతం, పోలీసుల స్పందన బావుందని 59.5 శాతం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.3 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ సేవలు : స్లాట్ బుకింగ్ ప్రాసెస్‌పై 63.4 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, అవినీతి లేదని 62.3 శాతం మంది చెప్పారు. ఇసుక : రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌పై 70.6 శాతం, లభ్యతపై 67.5 శాతం, ధర పైన 61.1 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ సేవలు : ఎఫ్ లైన్‌పై ఎక్కువ డబ్బులు వసూళ్లు చేయడం లేదని 77.4 శాతం, పాస్‌బుక్ సర్వేలో ఎక్కువ మొత్తం తీసుకోలేదని 75.1 శాతం చెప్పారు. ఎలక్ట్రిసిటీ : నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోందని 61.6 శాతం చెప్పారు. పంచాయతీ సేవలు : ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతోందని 56.7 శాతం చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ : అడ్మిషన్లపై 86.2 శాతం, సేవలపై 81.3 శాతం, ఆరోగ్య మిత్ర సాయంపై 82.4 శాతం మంది సంతృప్తి వ్యక్త చేయగా... అవినీతి లేదని 78.5 శాతం అన్నారు.

# రైతుకు నష్టం వస్తే... ప్రభుత్వం చూస్తూ ఉరుకోదు..

*- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్*



ఒంగోలు, నేటి పత్రిక ప్రజావార్త : హై, మీడియం గ్రేడ్ తో పాటు లో గ్రేడ్ పొగాకును కూడా రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఒంగోలు మండలం త్రోవగుంట పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సహచర మంత్రి డోలాతో కలిసి పరిశీలించిన ఆయన... పొగాకు కొనుగోలుకు సంబంధించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గడిచిన రెండేళ్లుగా పొగాకు కొనుగోలుతో వ్యాపారులు, కంపెనీ ప్రతినిధులు లాభాలు పొందారని గుర్తు చేశారు. అధిక ఉత్పత్తితో ప్రస్తుతం ఉన్నతక్కువ డిమాండ్ దృష్ట్యా రైతుల నుంచి పూర్తి స్థాయిలో పొగాకు కొనుగోళ్లకు బయ్యర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పొగాకు రైతులకు నష్టం వస్తుంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఉత్పత్తి ఎక్కువ అవడం వల్ల వచ్చిన మార్కెటింగ్ ఇబ్బందులను అధిగమించి... వ్యాపారులు కూడా పొగాకు రైతులకు సహకరిచాలని కోరారు. దీనిపై అవసరం అయితే పొగాకు బోర్డు కూడా ముందుకు వచ్చి.. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. బ్లాక్ బెర్లీ రకం పొగాకును కూడా కొనుగోలులో చిన్న చిన్న సమస్యలు ఉన్నా పరిష్కరించామని చెప్పిన మంత్రి.., బ్లాక్ బెర్లీ పొగాకును కూడా వెంటనే కొనుగోలు చేయాలని వ్యాపారులకు చెప్పారు.

**రైతులకు ముఖ్యమంత్రి బాసట....** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని చెప్పిన మంత్రి గొట్టిపాటి.., మామిడి సీజన్ లో రైతులకు సమస్య ఉత్పన్నం అయితే స్వయంగా సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి సమస్య పరిష్కరించిన విషయాన్నిగుర్తు చేశారు. ప్రస్తుతం బ్లాక్ బెర్లీ పొగాకు విషయంలోనూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 15, 16 తేదీల నుంచి మార్క్ ఫెడ్ ద్వారా... బ్లాక్ బెర్లీ రకం నల్ల పొగాకు కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలోనూ ఆయల్ పామ్, కోకో పంటల రైతులకు సమస్యలు ఎదురైనా ప్రభుత్వం వెంటనే పరిష్కరించిందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు. ఏదైనా చిన్న చిన్న సమస్యలు వచ్చినా... వాటిని వెంటనే పరిష్కరించి ముందుకు వెళ్తామని గొట్టిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



నరసరావుపేట, నేటి పత్రిక ప్రజావార్త : గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రానున్న ఏడాది కాలంలో జిల్లాలో మరో రెండు గురుకులాలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను పిల్లలకు అందిస్తేనే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. బుధవారం నాడు మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, గిరిజన సంక్షేమ, స్త్రీ & శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట నియోజకవర్గంలోని పెద్దతురకపాలెంలో మొత్తం రూ. 9.40 కోట్లతో నిర్మించిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించారు. రూ. 8.20 కోట్లతో నిర్మించిన గిరిజన గురుకుల పాఠశాలను మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, గుమ్మడి సంధ్యా రాణి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ప్రారంభించారు. అనంతరం పెద్దతురకపాలెం నుంచి గురుకులానికి రూ. 1.20 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రులు ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహాలు, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరచాలన్నదే తమ సంకల్పమని, ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు అరవింద్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యోగా ఆక్యుప్రెషర్, ఆయుర్వేదలతో అంతర పంచభూత అవయవాల పనితీరు సమస్థితి.



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మనుషులలో వచ్చే సమస్యలు విరిగినవి,తెగినవి మరియు కుళ్ళినవి తప్ప మిగతా సమస్యలు ప్రాణ శక్తి తగ్గి,తత్వాలలో వచ్చే మార్పులు మరియు అంతర పంచభూత అవయవాల పనితీరు మార్పుల వల్ల వస్తున్నాయని యోగశక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు విజయవాడ గవర్నమెంట్ ఆయుర్వేద హాస్పటల్ ఆవరణలో సూపరిడెంట్ డాక్టర్ పి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని ప్రసంగించారు. ప్రధాని మోడీ ఫిట్నెస్ మంత్ర గురించి మాట్లాడుతూ మానవులలో వచ్చే ఎక్కువ అనారోగ్యాలు అంతర పంచభూత అవయవాలలో వచ్చే మార్పులే కారణమని వాటిని నాడీ శోధనతో తెలుసుకొని,సమస్యను పరిష్కరించి ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ఆయుర్వేదంలో పంచకర్మ,వనమూలికలు వాడతారని, యోగ ఆక్యుప్రెషర్ లో ఎలాంటి బాహ్య మందులు వాడరని,దేహంలోనే నిక్షిప్తమై ఉన్న ప్రాణ శక్తిని పునః శక్తివంతం చేసి,ఆరోగ్యం పొందే లాగా చేస్తారని ప్రధాని మోడీ ఫిట్నెస్ మంత్ర ద్వారా పునః శక్తివంతం చేసేలాగా ఏర్పాటు చేసి భారత మరియు ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాలను తగ్గించిన మహనీయుడు మన ప్రధాని మోడీ అని కొనియాడారు.ఇకముందు ఎలాంటి ఉపద్రవాలు వచ్చినా మోడీ ఫిట్నెస్ మంత్ర ప్రపంచమంతా ఉపయోగపడుతుందని,కావున అందరూ ప్రతి రోజు మోడీ ఫిట్నెస్ మంత్ర ఆచరించి అనారోగ్యం నుండి ఆరోగ్యం, ఆనందం మరియు పూర్ణాయువు పొందవలసిందిగా కోరారు.హాస్పిటల్ సూపరిడెంట్ పి కృష్ణవేణి సభను ప్రారంభించి అందరికీ మోడీ హెల్త్ కేర్ స్టిక్స్ అందజేశారు.ఆస్పత్రి ఉద్యోగులు చికిత్స కొరకు వచ్చిన వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఏపీఎన్ సెట్-2025 నిర్వహణ

*డాక్టర్ పి. చంద్రశేఖర్, ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్ కు మంచి ఉపాధి అవకాశాలు, ఆదరణ ఉన్నాయని నర్సింగ్ కోర్సు చేసేవారికి ఇదొక మంచి అవకాశమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలియజేశారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజాన విశ్వ విద్యాలయం ఆవరణలో ఉదయం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తో పాటు నేను 12 వ వైస్ చాన్స్ లర్ గా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజాన విశ్వ విద్యాలయం కు వచ్చానన్నారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు లో అడ్మిషన్లకు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష (APNCET–2025) నిర్వహించాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తెలియజేసిందని అందుకు అనుగుణంగా మే 27, 2025 న నోటిఫికేషన్ విడుదల చేసామన్నారు. జూలై 6, 2025 ఏపీఎన్ సెట్ %-% 2025 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 2025–26 సంవత్సరాల ప్రవేశాలకుగాను డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజాన విశ్వ విద్యాలయం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ధరఖాస్తులను 28.05.2025 నుండి 20.06.2025 వరకు స్వీకరిస్తున్నామన్నారు. చివర రోజు 20.06.2025 న ఆన్ లైన్ ధరఖాస్తులను సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తామన్నారు. గతంలో ఈఏపీసెట్ (EAPCET) ఫలితాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరిగేదన్నారు. రాష్ట్రంలో 13,710 నర్సింగ్ సీట్లు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఉన్నాయన్నారు. ఇప్పటికే 5 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, ముమ్మందు ఇవి 15000 వరకు పెరుగుతాయని ఆశిస్తున్నామన్నారు. జూలై 1 న బీసీ రాయ్ దినోత్సవం సందర్భంగా పాటించే జాతీయ డాక్టర్ల దినోత్సవం నాడు పది మంది ఉత్తమ సేవలు అందించిన డాక్టర్లకు అవార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా వస్తారన్నారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధికా రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ కు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో నర్సుల కొరత మనకు చాలా ఉందని, ఇక్కడ నర్సింగ్ కోర్సు చేసి చాలామంది విదేశాల్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా అక్కడ పనిచేయడానికి ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ దేశాలకు, జర్మనీ దేశాలకు వెళ్లుతున్నారన్నారు. సంవత్సరానికి 3 లక్షల వరకు ఆదాయం వీరికి వస్తుందన్నారు. నర్సింగ్ లో ఇతర దేశాల్లో అధిక జీతాలకు మన విద్యార్థులు పని చేస్తున్నారన్నారు.. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఇతర దేశాల భాషలు కూడా నేర్పిస్తున్నారన్నారు. నర్సింగ్ సెట్ లో 100 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంగ్లీషు, నర్సింగ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల వారు కూడా దరఖాస్తు చేస్తారు కనుక 15 వేల వరకు అప్లికేషన్స్ వస్తాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం 1000 మందికి 3 మంది నర్సులు ఉండాలని, మన దేశంలో 1.9 మంది నర్సులు (దాదాపు 2 మంది) మాత్రమే ఉన్నారన్నారు.. నర్సింగ్ కు ప్రపంచ వ్యాప్తంగా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ నర్సింగ్ పరీక్ష 100 మార్కులకు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉంటుందని ఏ భాషలో అయినా రాయొచ్చన్నారు. ఇంటర్మీడియెట్ లెవల్లో ఒక్కో సబ్జెక్ట్ కు 20 మార్కులు చొప్పున బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీషు, నర్సింగ్ కు సంబంధించి రాష్ట్ర, సెంట్రల్ సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయని, నెగిటివ్ మార్కులు లేవన్నారు. కంప్యూటర్ అలవాటు లేనివారికి వారం రోజుల పాటు మాక్ టెస్టు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ http://drntr.uhsap.in/ ను సంప్రదించి, ధరఖాస్తు చేయొచ్చు.




# తెలంగాణ వార్తలు



## ఫీజుల దందాకు చెక్.. ఇంజినీరింగ్ కాలేజీలపై సీఎం



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో తరచూ ఫీజులు పెంచుతుండటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇలాగే ఫీజులు పెరుగుతూ పోతే భవిష్యత్తులో కన్వీనర్ కోటా సీట్లలో చేరేందుకు కూడా విద్యార్థులు వెనుకాడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. రాబోయే మూడేళ్ల (2025–26, 2026–27, 2027–28 విద్యా సంవత్సరాలు) కాలానికి ఇంజినీరింగ్ కళాశాలలకు కొత్త ఫీజులను ఖరారు చేసేందుకు అధికారులు రూపొందించిన నివేదికను సీఎంకు సమర్పించారు. ఈ నివేదికను పరిశీలించిన అనంతరం ఫీజుల పెంపునకు అనుసరిస్తున్న ప్రామాణికత ఏమిటని అధికారులను రేవంత్‌రెడ్డి ప్రశ్నించినట్లు సమాచారం. "ప్రతిసారీ ఫీజులు ఎందుకు పెంచుతున్నారు? కళాశాలలు అందిస్తున్న విద్యా నాణ్యత ఏ స్థాయిలో ఉంది? యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా?" వంటి అంశాలపై ఆయన ఆరా తీశారు. ఫీజుల ఖరారు విషయంలో ఆలస్యమైనా పర్వాలేదని, మరింత లోతుగా, శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.గతంలో, 2016 విద్యా సంవత్సరంలో, నాటి ప్రభుత్వం 40 విజిలెన్స్ బృందాలను ఇంజినీరింగ్ కళాశాలలకు పంపి, రికార్డులను తనిఖీ చేయించిందని సీఎం గుర్తుచేశారు. ఆ విజిలెన్స్ నివేదికలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయని, ఈ చర్చ సందర్భంగా, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ అంశాన్ని అధికారులు ప్రస్తావించగా, ఇంజినీరింగ్ విద్య తరహాలోనే పాఠశాలల ఫీజుల నియంత్రణకు కూడా ఒక సమగ్రమైన చట్టం తీసుకువద్దామని, దీనిపై కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించినట్టు తెలిసింది. రాబోయే 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ సీట్ల భర్తీ ప్రక్రియ జులై మొదటి లేదా రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. అప్పటికల్లా ప్రభుత్వం కొత్త ఫీజులను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ చేయాలి. అయితే, ఫీజుల ఖరారుపై మరింత సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో మిగిలిన నెల రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తవుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా కొత్త ఫీజులను సకాలంలో ఖరారు చేయని సందర్భాల్లో, పాత ఫీజులనే వసూలు చేసి, కొత్త ఫీజులు ఖరారైన తర్వాత వ్యత్యాసాన్ని సర్దుబాటు చేసుకునేలా కళాశాలలకు అనుమతిచ్చారు.

## ప్రభుత్వం ఇచ్చే అవార్డులను తప్పకుండా తీసుకోవాలి: దిల్ రాజు



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వాలు నిర్వహించే సినిమా అవార్డుల కార్యక్రమాలకు చిత్ర పరిశ్రమ ప్రముఖులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు సూచించారు. శనివారం అట్టహాసంగా జరిగిన 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం విజయవంతమైన నేపథ్యంలో, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఆయన ఆదివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్ర పరిశ్రమ ప్రభుత్వంతో కలిసి ప్రయాణించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. "త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ప్రకటించనుంది. ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుతున్నాయంటే, వాటిని ఎంతో గౌరవంగా స్వీకరించాలి. ఎక్కడ ఉన్నా, షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా సరే, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావాలి. ప్రభుత్వంతో కలిసి ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వాళ్లందరిపైనా ఉంది. ఇకపై ప్రభుత్వం తరఫున అవార్డుల వేడుక ప్రకటన వచ్చినప్పుడు, దయచేసి మీ డైరీలలో ఆ తేదీని నోట్ చేసుకోండి. మీకు వచ్చిన అవార్డును తప్పకుండా స్వీకరించండి. ఇది చిత్ర పరిశ్రమకు నా వ్యక్తిగత విజ్ఞప్తి. అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని దిల్ రాజు అన్నారు. 'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' వేడుక ఎంతో ఘనంగా జరిగిందని, ఇందుకు ఆనందంగా ఉందని దిల్ రాజు అన్నారు. "ఈ కార్యక్రమ విజయం కోసం గత ఆరు నెలలుగా శ్రమించాం. మొదట 2024 చిత్రాలకే పురస్కారాలు ఇవ్వాలని అనుకున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి అవార్డులు ఇస్తే బాగుంటుందని పలువురు సూచించడంతో ఆ దిశగా కమిటీని ఏర్పాటు చేశాం. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఏటా మూడు ఉత్తమచిత్రాలను ఎంపిక చేయడం సవాలుతో కూడుకున్న పని," అని ఆయన వివరించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంట సమయం కేటాయించినప్పటికీ, కార్యక్రమ ప్రణాళిక నాలుగున్నర గంటలు ఉండటంతో, తాను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రిని కలిసి, కార్యక్రమం పూర్తయ్యే వరకు ఉండాలని కోరినట్లు దిల్ రాజు తెలిపారు. "'ఎంతసేపు ఉండాలి?' అని సీఎం అడిగారు. 'పూర్తయ్యే వరకు ఉంటే చాలా సంతోషం సార్' అని చెప్పాను. ఆయన దాదాపు 2 గంటల 15 నిమిషాల పాటు ఉండి, విజేతలకు అవార్డులు అందజేశారు. ఇది అందరికీ ఎంతో ఆనందాన్నిచ్చింది" అని దిల్ రాజు పేర్కొన్నారు. ఈ పురస్కారాల వేడుకకు మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఈ నెల 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షల తేదీలు మార్పు

*-ఆ అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్షలు నిర్వహణ*

*-వెల్లడించిన మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి*

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినది. ఈ నేపథ్యంలో జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేస్తున్నట్లు మెగా డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా దే సందర్భంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని వారి రాకపోకలకు అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో ఈ పరీక్షల తేదీలు మార్చినట్లు తెలిపారు. ఈ అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలను మార్చిన హాల్ టిక్కెట్లు AP MEGA DSC-2025 website: https://apdsc.apcfss.in లో 25.06.2025 అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి మార్చిన హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోని వాటి ప్రకారం పరీక్షలకు హాజరు కావాల్సిందని మెగా %ఖాజ–%2025 కన్వీనర్ ఎం.వికృష్ణారెడ్డి కోరారు.

## శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ చిట్టినగర్ చిట్టి తిరుపతిగా వెలుగొందుచున్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం 14వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవంలో భాగంగా విద్యుత్ అలంకరణలతో, చలువ పందిరలు వేసి దేవస్థానం ప్రాంగణంలో ఐదు రకాల హోమగుండం లు తయారుచేసి ఈరోజు మొదటి రోజు ఉదయం 6 గంటలకు కృష్ణానది తీరాన 108 మంది పుణ్యస్త్రీ లచే దుర్గా ఘాట్ నుండి 108 కళాశ లతో కృష్ణా జలాలను తీసుకువచ్చి పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి 108 కళాశఅభిషేకం చేసి పాలు పెరుగు తేనె నెయ్యి పంచామృతాభిషేకాలు జరిగినవి. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడుగా చేశారు. సాయంత్రం విశ్వక్సేన పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, దీక్షాచరణ, కంకణ ధారణ గరుడ ఆరాధన,తీర్థ ప్రసాద వినియోగం జరిగినది. తదనంతరం దేవస్థానం కమిటీ వారు ఏర్పాటు చేసిన ప్రసాదములను భక్తులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఖానస ఆగమోక్తంగా పాంచానిక దీక్షతో జరుగుచున్నవి. డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు దేవస్థాన కార్యదర్శి, కోశాధికారి న్యాయవాది పిళ్ళా శ్రీనివాసరావుహా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి పొట్నూరి రాజా, వైస్ ప్రెసిడెంట్ మరు పిల్ల సత్యనారాయణ, కామందుల నరసింహారావు, బంక హనుమంతరావు, పోతిన ధర్మ రావు, పోతిని సాంబశివరావు, రాంపిల్ల వాసు, తమ్మిన శ్రీనివాసరావు, పిళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ ట్రస్టు అన్నదాన కార్యక్రమం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం డొక్కా సీతమ్మ ట్రస్టు ఛైర్మన్ అవుటుపల్లి విజయ కుమారి ఆధ్వర్యంలో బుధవారం 332 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఈ ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం డొక్కా సీతమ్మ అడుగుజాడలలో ఈ ట్రస్ట్ లో ఉన్న సంసాని విజయలక్ష్మి, గుబ్బల జ్యోతి ఇతర మహిళలు కూడా కలసి మేమే స్వయంగా వండి వడ్డన చేయడం జరుగుతుంది. ప్రతినెల ఈ అన్నదాన కార్యక్రమములో పలు రకాల వంటకాలు చేసి విందు భోజనం పెట్టినట్టు అక్కడికి వచ్చిన పాదచారులకు ఎంతో అభిమానంతో వడ్డించన చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు నోటీసులు... తీవ్రంగా స్పందించిన కవిత



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆమె ఆరోపించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. "రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. "మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు, ప్రజా గాయకుడు గద్దర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందని కవిత తీవ్రంగా విమర్శించారు. ప్రతి సందర్భంలోనూ గద్దర్ పేరును ప్రస్తావించే కాంగ్రెస్ ప్రభుత్వం, ఆయన పేరు మీద ఇస్తున్న సినిమా అవార్డుల ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటోను ముద్రించకపోవడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజా గాయకుడు గద్దర్ గారిని కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రతి సందర్భంలో గద్దర్ పేరును జపం చేసే కాంగ్రెస్ ప్రభుత్వం, వారి పేరు మీద ఇస్తున్నటువంటి సినీ అవార్డుల ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫోటో లేకపోవడం బాధాకరం" అని కవిత పేర్కొన్నారు. కనీసం అవార్డుల పంపిణీ కార్యక్రమంలోనైనా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, ఆయనను గౌరవించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని కవిత ఆరోపించారు. ఈ రెండు అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

## దళిత యువకులపై దాడికి నిరసనగా 28న చలో తెనాలి



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో దళిత, ప్రజాసంఘాల అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్లో జరిగిన దళిత, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో సభకు అధ్యక్షత వహించిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ఫాన్సిస్ రాజు మాట్లా డుతూ తెనాలిలో రెండు నెలల క్రితం తెనాలి అయితనగర్ లో అంబేద్కర్ విగ్ర హం తొలగించే విషయంలో పోలీస్ అధికారులకు స్థానిక దళితులకు మధ్య వివాదం ఉందన్నారు. తెనాలి స్థానిక శాసనసభ్యుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రోత్బ లంతోనే తెనాలి దళిత యువకులపై గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు 2 టౌన్ సీఐ రాములు నాయక్ 3 టౌన్ సీఐ రమేష్ బాబు లు దాడి చేశారన్నారు. పోలీసులు కొడితే తప్పే ముంది అన్న హోరీం మంత్రి అనిత వ్యాఖ్యలు చట్టా నికి రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. తెనాలి యువకుల పోలీసు దాష్టీకం పై సమగ్ర విచారణ చేసేందుకు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరపాలని సమావేశం డిమాండ్ చేసిందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్య దర్శి బుట్టి రాయప్ప మాట్లాడుతూ తెనాలి పోలీసులు చట్ట పరిధి ఉల్లంఘించి దుర్మా ర్గంగా యువకులను హింసించారని ప్రజల దృష్టి మరల్చేందుకు వారిని గంజాయి దారులుగా, రౌడీ లుగా చిత్రిస్తున్నారని అన్నారు. దళితులపై రెండునెలల కాలంలోనే దాడులు విపరీతంగా జరి గాయని, పైగా దళితుల వెలివేతలు డిప్యూటి సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలో జరిగినా పట్టించు కునే తీరిక ప్రభుత్వానికి లేదని విమర్శించారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్. ఏపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పై కూడా రౌడీషీట్ ఉందన్నారు. ఒంగోలులో రౌడీ షీటర్ ముప్పవరపు వీరయ్య చౌదరి పాడే మోసి పరామర్శించిన చంద్రబాబు నాయుడు తెనాలి యువకులను రౌడీలు అంటే హాస్యాస్పద మన్నారు. న్యాయం కోసం తమహా డిమాండ్ల సాధనకై తెనాలి దళిత మైనారిటీ యువకులపై పోలీసు దాష్టీకాన్ని నిరసిస్తూ ఈ నెల 28వ తేదీన చలో తెనాలి పిలుపును జయప్రదం చేయాలని దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో దళిత పరిరక్షణ సమితి అధ్యక్షులు నేలం నాగేంద్రరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి. వి సి కె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, కోడి కత్తి శ్రీను కేసు న్యాయవాది సలీం, వివిధ సంఘాల నాయకులు పేరూరి మురళి కుమార్ రమణకుమారి, తుల్లిబిల్లి అశోక్ బాబు నల్లపు నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

## చేపలవేట లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : బాదంపూడి లో గల దేశీయ జల మత్స్య సంవర్ధన శిక్షణా కేంద్రం 136 వ బృందములో చేపల వేటలో శిక్షణ పొందే అభ్యర్థులు తమ పేరు, చిరునామా, పుట్టిన తేదీ విద్యార్హతలు అనుభవము మొదలగు వివరాలు తెలుపుతూ తమ ధరఖాస్తులను 25.06.2025 వ తేదీలోగా మత్స్య శాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా వారి చిరునామాకు చేరే విధంగా పంపాల్సిందిగా కోరుచున్నామన్నా జిల్లా మత్స్య శాఖ అధికారి బి. నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శిక్షణ పొందుటకు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలోని వారు, మత్స్యకారులు, యువకులు, జాలరులు, సహకార సంఘముల సభ్యులు చేపల పెంపకము నందు ఆసక్తి కలిగిన ఇతరులు, షెడ్యూల్డ్ కులములు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు అర్హులు. ఉపకార వేతనము లేకుండా 20 సీట్లు కలవు ఇంటర్వ్యూ తేదీ, 27.06.2025 ఉదయం 11.00 గంటలకు మత్స్య శాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయములో నిర్వహించబడును. ఇంటర్వ్యూలో ఎంపికైన వారు పేర్లు అదే రోజు సాయంత్రం 4.00 గంటల తర్వాత కార్యాలయము నోటీసు బోర్డు లో పెడతారు. శిక్షణ కాలము మూడు నెలలు 01.07.2025 నుండి 30.09.2025 వరకు.. శిక్షణ కాలములో మత్స్య క్షేత్రములు మరియు రిజర్వాయర్లల్లో చేపలు పెంపకము గురించి భోదన మరియు ప్రాక్టికల్ తో కూడిన కోర్సు భోదించబడును. శిక్షణాంతరము పరిక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించబడును. 5వ తరగతి ఆ పైన చదువుకున్న వారికి ప్రాదాన్యత, తెలుగులో చదవడం, రాయడం తెలిసిన వారికి కూడా అవకాశము ఇవ్వబడుతుంది. 18–30 సంవత్సరముల మధ్య వయస్సు గల వారు అర్హులు, వారి అర్హతలు ఎంపిక కమిటీ ప్రత్యేక పరిగణనలో వయస్సు పరిమితిని సడలించవచ్చును. సహాయ పరిశీలకులు మత్స్యశాఖ హోదాకు తగ్గకుండా మత్స్యశాఖ అధికార్ల నుండి పొందిన అనుభవం గల సర్టిఫికెట్లు దరఖాస్తుతో జతపరిచి పంపాలి. అభ్యర్థి బయోడేటాలను స్వదస్తూరి,టైప్ చేసిన దరఖాస్తులు గానీ 25.06.2025 వ తేదీ లోగా కార్యాలయానికి పంపాలి.. సదరు ధరకాస్తు ఫారం సమాచారం సంబందిత జిల్లా మత్స్యశాఖ అధికారి ఏలూరు/మత్స్యశాఖ సహాయ సంచాలకులు, బాదంపూడి వారి కార్యాలయంలో లభించును. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికేట్లు విధిగా తీసుకురావలెను. ఇతర వివరాలకు 9573337484, 7286993033, 9492337469 మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి కార్యాలయం పనివేళల్లో సంప్రదించగలరు.

